క్లుప్తంగా

స్థానిక ఎన్నికలకు సర్వం సిద్ధం


ఎంపీడీఓ చంద్రమౌళి

తల్లాడ: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తల్లాడ ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. శుక్రవారం తల్లాడ మండలంలోని రెడ్డిగూడెం క్రీస్తు జ్యోతి కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ కళాశాలలోనే తల్లాడ, ఏన్కూరు, కల్లూరు మండలాల కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని రకాల మౌళిక సదుపాయాలను సమకూర్చినట్లు ఆయన వివరించారు.

డీసీసీబీ బ్రాంచ్‌ను సందర్శించిన చైర్మన్

తల్లాడ: తల్లాడ డీసీసీబీ బ్రాంచ్‌ను ఆ బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంక్ రికార్డులను పరిశీలించారు. రైతులకు, ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అందించే రుణాలను అర్హులైన వారందరికీ అందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ తల్లాడ బ్రాంచి మేనేజర్ రమ్యశ్రీ, మురళీమోహన్‌రావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికులకు సభ్యత్వం ఉండాలి


సభ్యత్వాలు అందించిన అబ్కారీ అధికారులు

వైరారూరల్: ప్రతీ గీత కార్మికుడికి సభ్యత్వం ఉండాలని అబ్కారీశాఖ అధికారులు మేడిపల్లి సాయిరాం, నల్లాల రతన్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాలడుగు గ్రామంలో అబ్కారీశాఖ ఆధ్వర్యంలో గీత కార్మికులకు సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ పంపిణీ


కుట్టుమిషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మధిర: మధిర పట్టణానికి చెందిన నిరుపేద మహిళకు దాత సహకారంతో శుక్రవారం కుట్టు మిషన్ ఉచితంగా పంపిణీ చేశారు. మధిర పట్టణానికి చెందిన నంద్రు సునీతకు ఆమె భర్త సంపాదన సరిపోకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఎవరైనా దాతలు కుట్టు మిషన్ ఇస్తే మిషన్ కుట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటామని ప్రభుత్వ ఉపాధ్యాయుడు చెడే శ్రీనివాస్‌కు తెలిపింది. ఆయన ఖమ్మంకు చెందిన అనుమోలు జగదీష్, లక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో.. సునీతకు కుట్టు మిషన్ అందించారు. దీంతో దాతలకు సునీత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కోట జయరాజు, ఉపాధ్యాయులు షేక్ చాంద్ బాషా, ఆవల రాంబాబు పాల్గొన్నారు.

13న దివ్యాంగుల వైద్యశిబిరం

కొణిజర్ల: ఈ నెల 13న వైరాలోని రైతు వేదికలో దివ్యాంగుల వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రోజారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ, ఆర్టిఫీషియల్ లింబ్ మానిఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో వయో వృద్ధులకు చేతి కర్రలు, వాకర్స్, వినికిడి యంత్రాలు, శారీరక దివ్యాంగులకు అవసరమైన చార్జింగ్ బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్, కృత్రిమకాళ్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైయ్యే వయో వృద్ధులు ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, వయసు ధృవీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తీసుకురావాలన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ప్రణాళికతో చదవాలి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు ప్రణాళికతో చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించగలరని సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన నాలెడ్జ్ ఎక్స్‌పో కార్యక్రమంలో.. విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం ఖమ్మం న్యూలైక్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షల ప్రిపరేషన్‌కు సమయ పాలన ముఖ్యమన్నారు. కళాశాల విద్యార్థుల పోటీ పరీక్షల కోచింగ్‌కు ఫీజులో 50శాతం రాయితీ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి.. మాకేది ?

కొణిజర్ల మండలంలో ఆర్టీసీ బస్సు వెళ్లని గ్రామాలెన్నో..

- ఉచిత ప్రయాణానికి దూరమవుతున్న మహిళలు
- ఆటోలను ఆశ్రయిస్తున్న గ్రామస్తులు
- ప్రత్యామ్నాయం పట్టని అధికారులు


పల్లిపాడు సెంటర్‌లో ఆటో ఎక్కుతున్న మహిళలు



కొణిజర్ల: కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని మహాలక్ష్మి పథకం కింద ప్రవేశపెట్టింది. దీంతో పలు పట్టణాలు, పల్లెల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ కొణిజర్ల మండలంలోని అనేక గ్రామాలకు బస్సులు రాకపోవడంతో అనేకమంది మహిళలు ఈ పథకానికి దూరమవుతున్నారు.

మండలంలోని వివరాలిలా..

కొణిజర్ల మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 50 శివారు గ్రామాలున్నాయి. అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక మహాలక్ష్మి పథకాన్ని పొందలేక పోతున్నారు. దీంతో ప్రయాణికులు ఆటోలు, ద్విచక్రవాహనాల పైనే ఆధారపడి ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ క్రమంలో పలుమార్లు ఆటోలు, ద్విచక్రవాహనాలు బోల్తా పడి ప్రాణాలు వదలడంతో పాటు తీవ్ర గాయాల అయిన సంఘటనలు అనేకం.

పట్టించుకోని అధికారులు..

బస్సు సర్వీసులు నడపాలని పలు మార్లు ప్రజాప్రతినిధులకు, ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మండలంలోని పల్లిపాడు మినహా లాలాపురం, తీగలబంజర, సాలెబంజర, లక్ష్మీపురం, మేకాలకుంట, అంజనాపురం, గుబ్బగుర్తి, గద్దలగూడెం, విక్రమ్‌నగర్, ఎల్ఎన్ నగర్, శ్రీనివాసనగర్, ఉప్పలచలక, రామనరసయ్యనగర్, మల్లుపల్లి ,అన్నవరం, తుమ్మలపల్లి తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. బస్వాపురం, పెద్ద మునగాల రూట్‌లో చింతకాని మండలం ప్రొద్దుటూరుకు ఒక బస్సు తిప్పుతున్నారు. అది వచ్చినప్పుడు మాత్రమే ఆయా గ్రామాల ప్రజలు బస్సు ఎక్కుతారు తర్వాత ఆటోలే దిక్కు. పెద్దగోపతి, చిన్న గోపతి, అమ్మపాలెం, అనంతారం గ్రామాల ప్రజలకు సైతం ఆటోలు, ద్విచక్రవాహనాలే దిక్కు.

మండలంలో ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు తిప్పడం లేదు. మండలంలోని దాదాపు 80శాతం గ్రామాల ప్రజలు ఆటోలు, ద్విచక్రవాహనాల మీదే ఆధారపడి ప్రయాణిస్తుంటారు.

గ్రామస్తుల ఇబ్బందులు..

గతంలో వైరా ఆర్టీసీ బస్టాండ్ నుంచి మధిర డిపో బస్సు సింగరాయపాలెం వరకు తిప్పేవారు బస్సుకు గిట్టుబాటు కావడం లేదని ఆ బస్సును నిలిపివేశారు. మల్లుపల్లి, రామనరసయ్యనగర్ ల నుంచి రోజూ సుమారు 100 మందికి పైగా విద్యార్థులు, గ్రామస్తులు పాఠశాల, కళాశాలలు, ఖమ్మం పనులకు వెళ్తుంటారు. ఈ గ్రామానికి గతంలో బస్సు నడిపేవారు కానీ.. గ్రామస్తులకు అనుకూల సమయంలో కాకుండా నడపడంతో బస్సు నిలిపివేశారు. ఈ విషయమై గ్రామస్తులు వైరా ఎమ్మెల్యేను కలిసి సమస్య వివరించినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. దీంతో కొంతమంది ఆటోలను ఆశ్రయించగా.. మరికొందరు సమీపంలోని ప్రాంతాలకు వెళ్లి అక్కడ నుంచి బస్సులో వెళ్తున్నారు.

ఆటోలతో నిత్యం ప్రమాదాలే..

మండలంలోని కొణిజర్ల, పల్లిపాడు, తనికెళ్ల సెంటర్ల నుంచి ఆయా గ్రామాలకు పదుల సంఖ్యలో ఆటోలు తిరుగుతుంటాయి. మితి మీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాదాలు జరిగినప్పుడే పోలీసులు ఇతర అధికారులు ఆటోలపై ఆంక్షలు పెడుతూ హడావిడి చేస్తున్నారు తప్ప పట్టించుకోవడం లేదు. దీనికి తోడు నిత్యం కూలీలను తీసుకుని ఆటోలు, టాటా ఏస్ వాహనాల్లో తీసుకు పోతున్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బంది అవుతోంది..



ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఆటోలోనే ప్రయాణం చేస్తున్నా. ఆటోలో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో ఇబ్బంది పడటమే కాకుండా.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడాల్సి వస్తుంది. అదే బస్సులో ప్రయాణం చేయాలంటే పల్లిపాడు వరకు ఆటోలో పోయి అక్కడ నుంచి బస్సు ఎక్కాలి. బస్సులు లేక ఇబ్బంది పడుతున్నాం.

– జి.జ్యోతి, సిద్దిక్‌నగర్

బస్సులు ఏర్పాటు చేయాలి..



పల్లిపాడు నుంచి అంజనాపురం మీదుగా ఉప్పలచలక వరకు ఆర్టీసీ బస్సు నడిపించాలి. మండలంలో దాదాపు 80శాతం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. రాత్రి పగలు తేడా లేకుండా ఆటోల్లో ప్రయాణం సాగించాల్సి వస్తుంది. అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవించినా సమస్య పట్టించుకోవడం లేదు.

– అనుమోలు రామారావు, సీఐటీయూ నాయకుడు, లాలాపురం

జాతీయ రహదారిపై అండర్ పాస్ ఇవ్వాలి


చింతకాని బస్వాపురం వద్ద దేవరపల్లి-సూర్యాపేట జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

చింతకాని: దేవరపల్లి నుంచి సూర్యాపేట వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారిపై చింతకాని మండలం బస్వాపురం గ్రామం వద్ద అండర్‌పాస్ ఇవ్వాలని శుక్రవారం రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్వాపురం గ్రామం నుంచి ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని అల్లీపురం గ్రామం వరకు 53 అడుగుల ప్రభుత్వ డొంక రహదారి ఉందని, జాతీయ రహదారిపై అండర్ పాస్ ఇవ్వకపోతే రహదారి సౌకర్యం లేక సుమారు 100 ఎకరాలు సాగుచేస్తున్న రైతులు ఇబ్బందులు పడతారని తెలిపారు. కార్యక్రమంలో బస్వాపురం, అల్లీపురం గ్రామాల రైతులు కన్నె బోయిన గోపి, చంద్రకాని నర్సింహారావు, పేర బోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం


సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

వైరా: ఎస్సీ వర్గీకరణ ప్రతిపాదనలు అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన సందర్భంగా ఎస్సీ సెల్ వైరా మండల అధ్యక్షుడు మోదుగు మురళి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు పమ్మి అశోక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చిత్రపటాలకు శుక్రవారం వైరాలో పాలాభిషేకం చేశారు. అనంతరం అశోక్ మురళి మాట్లాడుతూ.. మాదిగ ఉపకులాల 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చలవతో ఎస్సీ వర్గీకరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, వెంకయ్య, వీరయ్య, రత్నరాజు, రత్న భరత్, రవి, నాగరాజు, పుల్లయ్య, వెంకటి, శ్రీహరి, రమేష్, మీరా, విజయరాజు, ప్రేమ్‌రాజ్ , గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ల్యాండ్ సర్వేయర్ సేవలు

సత్తుపల్లిటౌన్: డిజిటల్ ల్యాండ్ సర్వేయర్ సేవలను ఎంఎస్ఎన్ డిజిటల్ ల్యాండ్ సర్వేయర్ల ద్వారా అందుబాటులోకి తేవడం అభినందనీయమని ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ మట్టా దయానంద్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లి ద్వారకాపూరి కాలనీలో నూతన డిజిటల్ ల్యాండ్ సర్వే కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ల్యాండ్ సర్వే, ఇళ్ల, ఇండ్ల స్థలాలు, వ్యవసాయ భూములు, రిజిస్ట్రేషన్, సర్వే నంబర్ ప్రకారం ల్యాండ్‌ను గుర్తించి సర్వే చేయడం, వాస్తు తదితర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. నిర్వాహకులు బి.మధుసూదన్ రావు, సురేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్, చెన్నారావు, నరసింహారావు, కాంతారెడ్డి, రాంబాబు, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గొరిగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గొరిగూడెం, రేజర్ల, కొత్తూరు, సిద్ధారం రోడ్, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో ఉండదని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

- పెనుబల్లి: పెనుబల్లి 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ రవితేజ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెనుబల్లి, వీయం బంజర్, రామచందర్‌రావుబంజర్, రంగారావు బంజర్, సీతారామపురం, బయ్యన్నగూడెం, నాయకుల గూడెం, మొండికుంట, మండాలపాడు గ్రామాలో విద్యుత్ ఉండదన్నారు.
- తల్లాడ: తల్లాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖాధికారి రాయల ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ పరిధిలోని అని గ్రామాలకు, మరియు పరిశ్రమలకు, విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.
- ముదిగొండ: మండలపరిధిలోని న్యూలక్ష్మీపురం , మాదాపురం సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ ఉండదని ముదిగొండ విద్యుత్‌శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ


క్షతగాత్రులకు ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి పొంగులేటి

బోనకల్: ఇటీవల బోనకల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యార్లగడ్డ వరమ్మ కుటుంబంతో పాటు గాయపడిన వారిని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. తొలుత వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబానికి అండగా నిలుస్తామని తెలిపారు. అనంతరం గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించిన మంత్రి ఆర్థికసాయం అందజేశారు. ఇంకొందరు హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. అంతకుముందు పలువురి ఇళ్లలో శుభకార్యాలకు మంత్రి హాజరు కాగా, ఇళ్లస్థలాల కోసం జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు కోటా రాంబాబు, దయాకర్‌రెడ్డి, వట్టికూటి సైదులు, సైదానాయక్, ఉమ్మినేని కృష్ణ, బోయినపల్లి మురళి, మండవపు తిరుమలరావు, బండి వెంకటేశ్వర్లు, పైడిపల్లి కిశోర్, తోటకూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రం


కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి విమర్శించారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యాన సత్తుపల్లి మండలం తాళ్లమడలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పట్టణ ప్రాంతాల్లో పేదలు పెరుగుతున్నారని, దీని కోసం పట్టణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొలిక పోగు సర్వేశ్వరరావు, జాజిరి శ్రీను, మోరంపూడి పాండు, బుచ్చయ్య, కుమారస్వామి, సనందన్‌రావు, కృష్ణ, రామారావు, రమేష్ పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

మడుపల్లి విద్యార్థుల ప్రతిభ

మధిర: మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ పోటీ పరీక్షలో మడుపల్లికి చెందిన చెరుకూరి రామ్ తేజ్, పారా కార్తీక్ ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మేడేపల్లి నుంచి 9మంది..

ముదిగొండ: మండలంలోని మేడేపల్లి జెడ్పీఉన్నత పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం బి.నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో జీవన్ మాధురి, బాల సృజన ఇద్దరు విద్యార్థులు జిల్లా ప్రధమ ర్యాంకులో ఉత్తీర్ణులైయ్యారు. ఎంపికైన విద్యార్థులను మాజీ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తుపల్లి నుంచి 12మంది..


నవ్యశ్రీ లక్ష్మి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వ బాలికల హైస్కూల్‌కు చెందిన 12మంది విద్యార్థినులు ఎన్ఎంఎంఎస్‌లకు ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి రూ.12వేలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్‌షిప్‌లు అందించబడతాయని హెచ్ఎం పి.నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా


ఆలయాన్ని సందర్శిస్తున్న సుదర్శన ప్రసాద్ తివారి, నాయకులు

తల్లాడ: మండలంలోని కలకొడిమ ఆంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ ఎండోమెంట్ కమిటీ రాష్ట్ర జాయింట్ కన్వీనర్, బీజేపీ ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ఇన్‌చార్జ్ సుదర్శన్ ప్రసాద్‌తివారి అన్నారు. దేవాలయాల సందర్శనలో భాగంగా శుక్రవారం కలకొడిమ గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఆలయ నిర్మాణ అభివృద్ధికి ఎండోమెంట్ సంస్థ నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తివారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడు చల్లా నాగులు, ఉపాధ్యక్షుడు సాయిచందు, నాయకులు రమేష్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిల్లలకు డీ వార్మింగ్ మాత్రలు వేయాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రశాంత్

ఎర్రుపాలెం: ఒకటి నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ డీ వార్మింగ్ మాత్రలు మింగించాలని మండల వైద్యాధికారి ప్రశాంత్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్న డీ వార్మింగ్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీలక్ష్మీ, ఆర్ఐ రవికుమార్, ఏసీడీపీఓ కవిత పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గోపాల్‌రావు

ఎర్రుపాలెం: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 10న హైదరాబాద్‌లో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల్‌రావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎర్రుపాలెంలో రామిశెట్టి పుల్లయ్య భవనంలో జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో పేదరికం, నిరుద్యోగం, విద్య, వైద్యం, ఆహార భద్రత అన్ని రంగాల్లో మోదీ ప్రభుత్వం వెనుకబడి పోయిందన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు దివ్వెల వీరయ్య, మద్దాల ప్రభాకర్, గొల్లపూడి కోటేశ్వరావు, జోగయ్య, వెంకటేశ్వర్లు, రామిశెట్టి సురేష్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

హనుమ మృతి తీరనిలోటు


హనుమ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న స్విమ్మర్స్ అసోసియేషన్ బాధ్యులు

మధిర: స్విమ్మర్ భూక్య హనుమ మృతి మధిర స్విమ్మర్స్ అసోసియేషన్‌కు తీరనిలోటని ఆ సంస్థ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి అన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన హనుమకు శుక్రవారం మధిర చెరువు వద్ద స్విమ్మర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏదైనా కార్యక్రమం చేసినప్పుడు హనుమ ఉత్సాహంగా పనిచేసేవాడన్నారు. ఆయన కుటుంబానికి అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంతోష్ కుమార్, అప్పారావు, సత్యనారాయణ, రాంబాబు, పూర్ణచంద్రరావు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసరావు, ప్రసాద్, హనీఫ్, రాజా, నవీన్ కుమార్, ఎల్వీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

బోనకల్: భవన నిర్మాణ కార్మికులకు ఉపయోగపడే సంక్షేమ బోర్డుకు బడ్జెట్‌లో వెయ్యికోట్ల రూపాయిలను కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో రూ.110 చెల్లించి నమోదు చేసిన ధనం నుంచి వెయ్యి కోట్లను కాళేశ్వరం ప్రాజెక్టుకు తరలించారన్నారు. వాటిని మరలా సంక్షేమ బోర్డులో జమ చేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు యంగల ఆనంద్‌రావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని రైతుల ధర్నా


ఐఓబీ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

తల్లాడ: కాంగ్రెస్ సర్కార్ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం రైతు సంఘం మడల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని కుర్నవల్లి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించి బ్యాంక్ మేనేజర్ వాకా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శీలం సత్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చి ఇప్పుడు కొంతమందికే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జీవరత్నం, ఆదినారాయణ, కిషోర్‌రెడ్డి, నరసింహారావు, దర్గయ్య, రామకృష్ణారెడ్డి, చలపతిరెడ్డి, రామిరెడ్డి, వెంకటశేషిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామిరెడ్డి, కృష్ణారెడ్డి, పుల్లయ్య, లింగారెడ్డి, రేణుక, యూకూబ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముదిగొండ: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు అన్నారు. మండలపరిధిలోని కమలాపురంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి డిప్యూటీ సీఎం భట్టి సిఫారస్ మేరకు నలుగురు లబ్దిదారులకు మంజూరైన రూ. 1.5లక్షల చెక్కులను ఆయన అందించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మధిర నియోజకవర్గ ఆత్మకమిటీ డైరెక్టర్లు వల్లూరి భద్రారెడ్డి, పందిరి అంజయ్య, నాయకులు పుల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బాబురాంరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.